# నేటి నుంచి గ్రామసభలు

- పథకాలకు దరఖాస్తుల స్వీకరణ
- ఉదయం 8నుంచి సాయంత్రం 6వరకు..
- ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ
- పకడ్బందీగా నిర్వహణ



దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయంలో గ్యారెంటీ పథకాల దరఖాస్తు పత్రాలను ఆవిష్కరిస్తున్న చైర్‌పర్సన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్ గౌడ్, కౌన్సిలర్లు



బోడుప్పల్ కౌన్సిల్‌లో మాట్లాడుతున్న మేయర్ బుచ్చిరెడ్డి,పక్కన కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి సమావేశానికి హాజరైన కౌన్సిల్ సభ్యులు

మేడ్చల్‌జోన్‌బృందం, డిసెంబర్ 27: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా కార్పొరేషన్లు,మున్సిపాలిటీలు, మండలాల్లో అధికారులు గ్రామసభలు నిర్వహించి ఆరు గ్యారెంటీ పథకాలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఈ కార్యక్రమంపై కార్పొరేషన్లు,మున్సిపాలిటీలు, మండలాల్లో అధికారులు బుధవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు మాట్లాడుతూ గురువారం నుంచి ఉదయం8గంటలనుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ప్రజలనుంచి దరఖాస్తులను స్వీకరిస్తారని తెలిపారు.గ్రామాల్లో రోజువారీగా నిర్వహించే కార్యక్రమాలపై ప్రత్యేక అధికారుల ఏర్పాటుతో పాటు తేదీలను ప్రకటించారు.కాగా మేడ్చల్, తూంకుంట, ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల్లో గురువారం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కమిషనర్లు త్రిల్లేశ్వర్‌రావు,జేతూరామ్‌నాయక్, కమిషనర్లు వేమన రెడ్డి, ఎండీ సాబేర్ అలీ తదితరులు పేర్కొన్నారు.

**శామీర్‌పేటలో....**

ప్రభుత్వాదేశాల మేరకు బుధవారం శామీర్‌పేట మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్లూభాయిబాబు, జడ్పీటీసీ అనితలాలయ్య, వైస్ ఎంపీపీ సుజాత, ఎంపీవో మంగతాయారు, డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్న, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు, కార్యదర్శులు, కారోబార్లు పాల్గొన్నారు.

**పీర్జాదిగూడలో...**

ఈనెల 28తేదీ నుంచి జనవరి 6వ తేదీ వరకు జరుగుతున్న ప్రజాపాలన కార్యక్రమంలో ఎలాంటి లోటు పాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం పై మేయర్, డిప్యూటీ మేయర్ శివకుమార్‌గౌడ్, కమిషనర్ ఇస్లావత్ నమ్యతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, కో ఆప్షన్ మెంబర్లు, అధికారులు ఉన్నారు.

**ఘట్‌కేసర్‌లో...**

ఆరు గ్యారెంటీలను ప్రజలకు అందించేందుకు దరఖాస్తుల స్వీకరిస్తున్నట్లు పోచారం, ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో కమిషనర్లు జేతురామ్‌నాయక్, వేమనరెడ్డి, ఎండీ సాబేర్ అలీ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. అదే విధంగా ఘట్‌కేసర్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణపై మండల స్థాయిలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సమావేశంలో ఎంపీడీవో అరుణ, ఎంపీవో నందకిశోర్, ఏవో బాసిత్, డిప్యూటీ తహసీల్దార్ సందీప్, అధికారులు పాల్గొన్నారు.

**నాగారం, దమ్మాయిగూడలో...**

నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో చైర్మన్‌లు కౌకుంట్ల చంద్రారెడ్డి, ప్రణీతశ్రీకాంత్‌గౌడ్‌లు ప్రభుత్వ గ్యారెంటీలపై అవగాహన సదస్సులు బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్లు రాజేందర్‌కుమార్, రాజమల్లయ్య, వైస్ చైర్మన్‌లు నరేందర్‌రెడ్డి, మల్లేశ్‌యాదవ్, మేనేజర్లు చంద్రశేఖర్, వెంకటేశం, డీఈఈలు రఘు, చిరంజీవులు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

**బోడుప్పల్‌లో...**

ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మేయర్ సామల బుచ్చిరెడ్డి, కమిషనర్ వేణుగోపాల్ రెడ్డి కౌన్సిల్ సభ్యులను కోరారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ప్రజాపాలన ఆరు గ్యారంటీల విధివిధానాలతో పాటు పలు అంశాలను చర్చించారు.

**జవహర్‌నగర్‌లో...**

ప్రజాపాలనను పకడ్బందీగా నిర్వహిస్తామని మేయర్ మేకల కావ్య అన్నారు. బుధవారం డ్వాక్రా భవన్‌లో ప్రజాపాలనపై మేయర్ కావ్య అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ రామలింగం, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కార్పొరేటర్లు, కోఆప్షన్‌సభ్యులు, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, అంగన్‌వాడీ, డ్వాక్రా, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



శామీర్‌పేటలో ప్రజా పాలన అవగాహన సదస్సులో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు




నాగారం మున్సిపాలిటీ కార్యాలయంలో గ్యారంటీలపై నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి

## ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

మేడ్చల్, డిసెంబర్ 27 : ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార మార్గాలు చూపాలని ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య కోరారు. ఆయన ఆధ్వర్యంలో బుధవారం మేడ్చల్ జిల్లా జాయింట్ కలెక్టర్ విజయానందరెడ్డికి ఆటో కార్మికుల సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ టౌన్ అధ్యక్షుడు ఎర్ర విజయరావ్, మండల అధ్యక్షుడు మహేశ్‌యాదవ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు మన్నె గోపాల్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు హైమద్, స్కూల్ అధ్యక్షుడు డి.శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి చిన్నం బాల, ఉప్పల్ అధ్యక్షుడు రామాంజనేయులు, పాల్గొన్నారు.

## కార్యదర్శి విధులు అడ్డుకున్న సర్పంచ్ భర్తపై కేసు

ఘట్‌కేసర్ రూరల్: పంచాయతీ కార్యదర్శి విధులను అడ్డుకుని దుర్భాషలాడిన సర్పంచ్ భర్తపై కేసు నమోదైన ఘటన ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధి అవుషాపూర్‌లో జరిగింది. ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ ఎం మహేందర్ రెడ్డి కథనం ప్రకారం... అవుషాపూర్‌కు చెందిన రాంచంద్రారెడ్డి రోడ్డును ఆక్రమించి నిర్మించిన ర్యాంప్‌ను పంచాయతీ కార్యదర్శి సునీత జేసీబీతో కూల్చివేయించారు. దీంతో సర్పంచ్ కావేరి భర్త మశ్చేందర్ రెడ్డి తమకు సమాచారం ఇవ్వకుండా ఎలా కూల్చివేస్తావని నిలదీయటంతో పాటు కార్యదర్శిని దుర్భాషలాడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మేడ్చల్, డిసెంబర్ 27: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోబుధవారం చోటు చేసుకుంది.ఎస్‌ఐ లావణ్య కథనం ప్రకారం ..సోమవారం గ్రామంలో బుధవారం మేడ్చల్ వైపు వస్తున్న డీసీఎం దట్టమైన పొగమంచు కారణంగా ఎదురుగా వస్తున్న వాహనం కనిపించ ఒక్కసారిగా డ్రైవర్ బ్రేక్ వేయడంతో అదుపు తప్పి బోల్తా పడింది. గాయాలైన వారిని చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారు.

## సాయిగీతాశ్రమంలో మహాగణపతి హోమం

మేడ్చల్‌రూరల్, డిసెంబర్ 27: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోని కండ్లకోయలోని సాయి గీతాశ్రమంలో బుధవారం శ్రీ మహాగణపతి హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ ఉత్తరాధికారి శ్రీ కీర్తిమా, ఆశ్రమ మేనేజర్ శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

## పుస్తె మట్టెల పంపిణీ

మేడ్చల్ రూరల్: ఆడబిడ్డ పెండ్లికి మేడ్చల్ మాజీ ఎంపీపీ పద్మా జగన్‌రెడ్డి పుస్తెమట్టెలు అందజేశారు. మేడ్చల్ మండలంలోని గౌడవెల్లి గ్రామానికి చెందిన మలిగె రవీందర్ కూతురు రేవతి పెండ్లి నిశ్చయమైన విషయాన్ని తెలుసుకున్న ఆ గ్రామ మాజీ ఎంపీపీ తన వంతు సహాయంగా వారికి పుస్తె మట్టెలు ప్రదానం చేశారు.

## చిన్నారిపై వీధికుక్కల దాడి.. తీవ్రగాయాలు

కీసర: వీధికుక్కల దాడిలో ఓ చిన్నారికి తీవ్ర గాయాలైన ఘటన కీసర పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కీసరకు అనుబంధ గ్రామంగా ఉన్న వన్నీగూడకు చెందిన 11 నెలల చిన్నారిపై వీధికుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో ఆ బాలికకు తీవ గాయాలయ్యాయి. కుటుంబీకులు వెంటనే ఆ చిన్నారిని నగరంలోని నిలోఫర్ దవాఖానకు చికిత్స నిమిత్తం తరలించారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



అయోధ్యనగర్ కాలనీలో భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న మేయర్ వెంకట్‌రెడ్డి

పీర్జాదిగూడ,డిసెంబర్ 27: పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధి మొదటి డివిజన్ అయోధ్యనగర్ కాలనీలో నూతనంగా చేపట్టిన సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను బుధవారం మేయర్ జక్క వెంకట్‌రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని అధికారులను, కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులుపాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప మహాపడిపూజ

ఘట్‌కేసర్,డిసెంబర్27: పోచారం గ్రామంలోని శ్రీ స్ఫటిక లింగేశ్వర స్వామి ఆలయం వద్ద ప్రజా ప్రతినిధులు, అయ్యప్ప భక్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప మహాపడిపూజలో ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎస్‌వైఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో పోచారం చైర్మన్ కొండల్‌రెడ్డి, కౌన్సిలర్లు,ఎస్‌వైఆర్ ట్రస్టు అధ్యక్షుడు యాదగిరి రెడ్డి,ప్రధాన కార్యదర్శి సందీప్ రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మేడ్చల్,డిసెంబరు 27: వచ్చే విద్యా సంవత్సరంలో సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు మేడ్చల్ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒకటి గంటల వరకు జరుగుతుందన్నారు. 4వ తరగతి చదువుతున్న అన్ని వర్గాలకు చెందిన విద్యార్థులు దరఖాస్తుకు అర్హులని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చే నెల 6వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్.ఇన్ లేదా http/:tgcet.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

## అందరి సహకారంతో నాగారం అభివృద్ధి

మేడ్చల్ కలెక్టరేట్, డిసెంబర్ 27: అందరి సహకారంతో నాగారం అభివృద్ధి చేస్తున్నామని మున్సిపాలిటీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. మున్సిపాలిటీ మున్సిపల్ పరిధిలోని 5వ వార్డు రెడ్డి కాలనీలో రూ.3 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను బుధవారం చంద్రారెడ్డి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అన్నంరాజు లావణ్య, నాయకులు శ్రీనివాస్, కాలనీ వాసులు పాల్గొన్నారు.



5వ వార్డులో సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న చైర్మన్ చంద్రారెడ్డి

## బిడ్డ తన మాట వినలేదని..

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 27: ఫిట్స్‌తో బాధపడుతున్న కూతురిని ఎంబీబీఎస్ చదవద్దంటే తన మాట వినడం లేదని మనస్తాపానికి గురైన ఓ తల్లి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన పోచారం ఐటీసీ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ వి.అశోక్ రెడ్డి కథనం ప్రకారం..పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ గ్రామానికి చెందిన ఎల్లంకి భాస్కర్, లావణ్య(38) దంపతులు. వీరికి కూతురు, కుమారుడు ఉన్నారు. కూతురుకు ఓ ప్రైవేట్ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు రావడంతో పోచారం మున్సిపాలిటీ పరిధిలోని సద్భావన టౌన్‌షిప్‌లో అద్దె భవనంలో ఉంటున్నారు. కూతురు ఫిట్స్‌తో బాధపడుతున్నది. దీంతో ఆమెను ఎంబీబీఎస్ చదవద్దని తల్లి కోరింది. కూతురు మాత్రం.. తాను ఎంబీబీఎస్ చదివి, డాక్టర్ కావాలని ఉన్నదని తల్లిని అభ్యర్థించింది. తల్లి కూడా అంగీకరిచింది. ఈ నెల 25న కుటుంబ సభ్యులు అందరు కలిసి వేములవాడ ఆలయానికి దర్శనం కోసం వెళ్లి, 26న సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చారు. అదే రోజు రాత్రి భోజనం చేసి అందరు నిద్రపోయారు. బుధవారం తెల్లవారు జామున భాస్కర్ వాష్‌రూమ్ కోసం మేల్కొని చూడగా.. అతడి భార్య కనిపించలేదు. ఇంటి బయటకు వచ్చి ఆరా తీయగా.. పోచారం శివాలయం దగ్గర ఉన్న చెరువు వైపు వెళ్లినట్లు స్థానికులు చెప్పారు. అక్కడికి వెళ్లి చూడగా.. చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు శవాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం నగరంలోని గాంధీ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.